## క్లుప్తంగా

### రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు నీరు

**సీతంపేట:** జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి డ్రెయిన్ నుంచి మురుగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో స్థానికులు అవస్థల పాలయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైనుంచి చెత్తాచెదారం పల్లపు ప్రాంతానికి కొట్టుకొచ్చి డ్రెయిన్లలో మేటలు వేయడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన



విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్ అరుణ

**డాబాగార్డెన్స్:** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్ అరుణ విద్యార్థులకు కంప్యూటర్‌పై టైపింగ్ నేర్పించారు. అనంతరం విద్యార్థులు ఆటలు, పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం పుస్తకాలు చదివారు. విద్యార్థులకు శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా మెలోడీ క్రియేటర్స్ వార్షికోత్సవం



సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

**డాబాగార్డెన్స్:** మెలోడి క్రియేటర్స్ 24వ వార్షికోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ సంఘ సేవకుడు వంకాయల సన్యాసిరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ విశాఖ వాసుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సాంస్కృతిక సంస్థ మెలోడీ క్రియేటర్స్ అన్నారు. ప్రేక్షకుల ఆదరణ పొందే దిశగా ఎన్నో సంగీత కార్యక్రమాలు న్విహించిన నిర్వాహకులను అభినందించారు. నటుడిగా ఎన్‌టీఆర్, గాయకుడిగా బాలసుబ్రహ్మణ్యం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి. వెంకట్రావు, రమేష్‌చంద్ జైన్, కొణతాల రాజు, ఉషా చీరాల, ఎం. మస్తాన్‌రెడ్డి, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీ రాజశేఖర్, ప్రోగ్రామ్ కన్వీనర్ కె. వీరాస్వామి, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# కౌంటింగ్ ప్రక్రియలో జాగ్రత్తలు అవసరం

- ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ



మాట్లాడుతున్న కె.కె.రాజు



శిక్షణలో పాల్గొన్న పార్టీ ముఖ్య నాయకులు, శ్రేణులు, ఏజెంట్లు

**సీతమ్మధార:** ఈ నెల 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కౌంటింగ్ ఏజెంట్లకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సూచించారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఏజెంట్ అప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని, సెక్యూరిటీ అధికారులు అనుమతించిన వెంటనే కౌంటింగ్ హాల్‌లో వారి వారి టేబుల్ దగ్గర కూర్చోవాలని, సెల్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లరాదని సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ బాడ్జ్ ఇస్తారని, వారు సూచించిన టేబుల్ వద్దకు వెళ్లాలని, ఏజెంట్‌కు అనుమానం వచ్చిన వెంటనే ఆర్వో దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. ఎవరైనా రెచ్చగొట్టిన శాంతంగా ఉండాలని సూచించారు.

రిటైర్డ్ తహసీల్దార్ సత్తి నాగేశ్వరరెడ్డి ఏజెంట్లకు కౌంటింగ్ హాల్‌లో ఎలా ఉండాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఎన్నికల పరిశీలకులు రొంగలి జగన్నాథం, పేడాడ రమణికుమారి, పీలా వెంకటలక్ష్మి, వుడా మాజీ చైర్మన్ రవిరాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, సారిపల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వి.ప్రసాద్, ఆళ్ల లీలావతి, సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకులు రవిరాజు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్లర్లు చేస్తే కఠిన చర్యలు



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ రాజు

**సీతమ్మధార:** ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఉంటుందని, రౌడీషీటర్లు హద్దు మీరకుండా ఉండాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఏఎస్ఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా ఉండాలన్నారు.

**పోలీసుల వలయంలో ఏయూ ప్రాంగణం**

**ఏయూ క్యాంపస్:** పోలీసుల వలయంలోకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వెళ్లింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రక్రియ మొత్తం ఇక్కడే జరుగుతోంది. మరి కొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో భద్రతతను మరింత కట్టుదిట్టం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రాంగణం మొత్తం పోలీసుల నిఘాలో ఉండనుంది.

# జర్నలిస్ట్ దుర్గారావు సేవలు చిరస్మరణీయం



దుర్గారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్, గంట్ల శ్రీనుబాబు తదితరులు

**సీతంపేట:** జర్నలిస్ట్ సంఘాల నాయకుడిగా, సీనియర్ పాత్రికేయుడిగా సోడిశెట్టి దుర్గారావు అందించిన సేవలు చిరస్మరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం మైదానంలో ఆదివారం దుర్గారావు రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీధర్‌తోపాటు పలువురు జర్నలిస్టులు దుర్గారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గారావు జర్నలిస్టుగా అందరి మనసుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దుర్గారావు మరణించి రెండేళ్లు కావస్తున్నా.. నేటికీ అందరి మనసుల్లో నిలిచి ఉన్నారన్నారు. అనంతరం లెన్స్ హన్స్ సంస్థ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి డ్రాప్స్, ఉచితంగా మందులు, 50 శాతం రాయితీతో కళ్లద్దాలు అందజేశారు. వర్షం కారణంగా క్రికెట్ మ్యాచ్ వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు వాల్మీకి నాగరాజు, లోకేష్‌కుమార్, గుండురాజు, దుర్గారావు కుమారులు నిఖిల్, లోహిత్ పాల్గొన్నారు.

# నవ్వులు పంచిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

**సీతంపేట:** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అతిథులు దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, సూర్య, పూర్ణచంద్రరావు కళాకారులను సత్కరించి అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పునఃప్రారంభం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పునఃప్రారంభిస్తున్న పోచారెడ్డి రాకేష్‌రెడ్డి

**డాబాగార్డెన్స్:** ఆధునికంగా పునర్నిర్మించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పోచారెడ్డి రాకేష్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వజ్జిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆధునిక హంగులతో పునర్నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు, సోడదాసు సుధాకర్, కస్తూరి వెంకట్రావు, పిరిడి భగత్, గవర వెంకటరమణ, నాగఫణి, పి. పరమేశ్వరరావు, డోలా శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి రమేష్, సనపల అన్నాజీ, పరదేశి, సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన వేసవి నృత్య శిక్షణ శిబిరం



శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులు

**ఆరిలోవ:** జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో నెల రోజుల పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అకాడమీ నృత్యకారులు సుమారు 100 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**వైభవంగా నిత్య కల్యాణం**

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

# అద్భుతంగా హాస్టళ్లు

- సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలకు మహర్దశ
- రూ.53.10 లక్షలతో ఆధునికీకరణ, వసతుల కల్పన
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



సీతమ్మధారలో కళాశాల విద్యార్థుల హాస్టల్



రూపురేఖలు మారిన బాలుర వసతి గృహం–2



వసతి గృహంలో నిర్మించిన మరుగుదొడ్లు

**సీతమ్మధార:** రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సీతమ్మధారలో నిర్వహిస్తున్న బాలుర వసతి గృహాలకు మహర్దశ పట్టింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మునుపెన్నడూ లేనివిధంగా ఈ హాస్టళ్లను అద్భుతంగా అభివృద్ధి చేశారు. విద్యార్థుల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. 1975లో సీతమ్మధార టీపీటీ కాలనీలో ప్రీ మెట్రిక్ వసతి గృహాన్ని నాటి కేంద్ర యూనియన్ డిప్యూటీ మినిస్టర్ జి.వెంకటస్వామి, రాష్ట్ర హరిజన, గిరిజన వెల్ఫేర్ మంత్రి బట్టం శ్రీరామమూర్తి ప్రారంభించారు. 2008లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌ను ఓపెన్ చేశారు. ఇవి కొన్నేళ్ల పాటు బాగానే నడిచాయి. కాలక్రమేణా బాలుర వసతి గృహం–2తోపాటు కళాశాల హాస్టల్ మరుగుదొడ్లు పాడై, ఫ్యాన్లు తిరగక, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు.

**ప్రభుత్వ సహకారంతో సుందరీకరణ**

సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కలెక్టర్ ఎ.మల్లికార్జునను కోరగా.. స్పందించిన ఆయన హాస్టళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. 15వ లోకసభ ఎంపీ ల్యాడ్స్ ఫండ్ ద్వారా బాలుర వసతి గృహాన్ని రూ.15.50 లక్షలతో, కళాశాల విద్యార్థుల హాస్టల్‌ను రూ.37.60 లక్షలతో ఆధునికీకరించి మౌలిక సదుపాయాలు కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వసతి గృహాలను సుందరీకరించారు. ప్రస్తుతం ఈ రెండు హాస్టళ్లలో వివిధ ప్రాంతాలకు చెందిన 122 మంది విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు.

**బాలుర వసతి గృహం–2**

బాలుర వసతి గృహం–2లో 4 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది నూతన ప్రవేశాలు జరగనున్నాయి. ఏడు మరుగుదొడ్లు. రెండు పెద్ద స్నానం గదులు నిర్మించారు. ఐదు నివాస గదులకు మరమ్మతులు చేసి కొత్త ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో ఉండేలా వసతి గృహాన్ని తీర్చిదిద్దారు.

**కాలేజీ విద్యార్థుల హాస్టల్**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు మొత్తం 92 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఆరు గదులు, 12 మరుగుదొడ్లు, 8 స్నానం గదులు, హ్యాండ్ వాష్ బేసిన్ నిర్మించారు. నీటి సమస్య లేకుండా బోరు ఏర్పాటు చేశారు. డైనింగ్, విద్యార్థులు ఉండే ఆరు పెద్ద గదులను మౌలిక సదుపాయాలతో చక్కగా తీర్చిదిద్దారు. వసతి గృహాలను అందంగా మార్చి సకల సదుపాయాలు కల్పించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

**కొమ్మాది:** సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

### అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



సూపరింటెండెంట్ వెంకటరమణకు చెక్కు అందజేస్తున్న నండూరి రామకృష్ణ

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు.

# దంచికొట్టిన వాన



దొండపర్తి ఎరుకుమాంబ ఆలయ రహదారిలో వర్షంలో ప్రయాణిస్తున్న వాహనాలు



జోరువానలో దాలిరాజు మార్కెట్ వద్ద పెట్రోల్ బంక్‌లో ఉన్న వాహన చోదకులు



**సీతమ్మధార:** ఎండలతో అల్లాడిన ప్రజలకు ఆదివారం ఉదయం, రాత్రి కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఆదివారం ఉదయం ఏడున్నర నుంచి దాదాపు అరగంట పాటు కురిసిన వర్షానికి సీతంపేట, అక్కయ్యపాలెం, డైమండ్ పార్కు, న్యూకాలనీ, అల్లిపురం, దొండపర్తి తదితర ప్రాంతాల రోడ్లపై వర్షం పారాడింది. కాగా రాత్రి పది గంటల సమయంలో మరోసారి కురిసిన భారీ వర్షానికి రహదారుల, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షంలోనే వాహనాలు రాకపోకలు సాగించాయి. వర్షం భారీగా కురవటంతో చాలా ప్రాంతాల్లో ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. ఉదయం, రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు సేదదీరారు.



వర్షంలో వాహనాల రాకపోకలు ఒకవైపు..





వానలో తడుస్తూ ప్రయాణిస్తున్న వాహన చోదకులు మరోవైపు...

### దైవ నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం



గీతాలు ఆలపిస్తున్న ఆధ్యాత్మిక వేత్తలు

**డాబాగార్డెన్స్ :** నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తెలిపారు. నగరంలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం నామ సంకీర్తన, భక్తి గీతాలాపన, ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. ముందుగా మందిరంలో వేంచేసిన కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కె. నాగేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, కోల్‌కతా ప్రసాద్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిపై నివశిస్తున్న జీవునికి నామ సంకీర్తనతోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. భగవన్నామ సంకీర్తనలు చేస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, భక్తులు పాల్గొన్నారు.